క్లుప్తంగా

జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా శ్రీనివాస్



డీఈఓ నుంచి ఉత్తర్వులు అందుకున్న శ్రీనివాస్

మలికిపురం: అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా మలికిపురం మండలం పడమటిపాలెం ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఏవీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు డీఈవో కమలకుమారి నుంచి నియామక ఉత్తర్వులు తీసుకున్నారు. శ్రీనివాస్ శనివారం మలికిపురంలో మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు. డీఈఓకు ధన్యవాదాలు తెలిపారు.

కార్డుదారులందరికీ రేషన్ అందించాలి



ఎండీయూ వాహనాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

అంబాజీపేట: అర్హులైన కార్డుదారులందరికీ రేషన్ పూర్తి స్థాయిలో సక్రమంగా అందించాలని తహసీల్దార్ జి.వెంకటేశ్వరి అన్నారు. మాచవరంలో ఎండీయూ వాహనం ద్వారా పంపిణీ జరుగుతున్న రేషన్‌ను శనివారం తహసీల్దార్ పరిశీలించారు. తహసీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ ఇళ్ల వద్దకు వచ్చిన ఎండీయూ వాహనాల నుంచి బియ్యం తీసుకోవాలన్నారు. సాంకేతిక లోపాలు తలెత్తినా వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వో రమేష్‌లు పాల్గొన్నారు.

సూర్యారావు సేవలు ఎనలేనివి



పుల్లేటికుర్రులో సూర్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అంబాజీపేట: ఎమ్మార్పీఎస్ సంఘ అభివృద్ధితో పాటు జాతి కోసం అహర్నిశలు ఎమ్మార్పీఎస్ నాయకుడు కొల్లి సూర్యారావు చేసిన సేవలు ఎనలేనివని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. పుల్లేటికుర్రులో సూర్యారావు సంతాప సభ ఆకుమర్తి ఆశీర్వాదం అధ్యక్షతన శనివారం జరిగింది. సూర్యారావు చిత్రపటం వద్ద నివాళులర్పించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించి సంతాపం వ్యక్తం చేశారు. గంపల సత్యప్రసాద్, ఉందుర్తి నాగబాబు, యార్లగడ్డ రవీంద్ర, ఉందుర్తి ఆనంద బాబు, చుట్టుగుళ్ల నీలకంఠం, చేట్ల రామారావు, యార్లగడ్డ సత్తిబాబు, ఆకుమర్తి రమేష్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



మామిడికుదురులో విరాళాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

మామిడికుదురు: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మామిడికుదురులో అంగన్‌వాడీ ఉద్యోగులు పలువురు దాతల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. కోనసీమ జిల్లా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఈ విరాళాలు సేకరిస్తున్నారు. సేకరించిన విరాళాలను అంగన్‌వాడీ యూనియన్‌కు అందజేస్తామని తెలిపారు. విరాళాల సేకరణలో అంగన్‌వాడీ యూనియన్ మండల శాఖ అధ్యక్షురాలు ఎన్.అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు వీఎంజీ కుమారి, ఎన్.రాజ్యలక్ష్మి, కె.మంగతాయారు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ దినోత్సవం

అయినవిల్లి: యూటీఎఫ్ దినోత్సవాన్ని స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించి, స్వీట్లు పంచారు. యూటీఎఫ్ అందిస్తున్న సేవలను కొనియాడారు.

ఎనిమిది మద్యం సీసాల పట్టివేత

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది మద్యం సీసాలను సుంకర పాలెం చెక్‌పోస్టు అధికారులు శనివారం పట్టుకున్నారు. రాజమహేంద్రవరంకు చెందిన యువకుడు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు చెక్‌పోస్టు ఎస్సై రామస్వామి తెలిపారు.

మూణ్ణాళ్ల ముచ్చటే..

- మూడున్నర నెలలకే ఛిద్రమైన తారు రోడ్డు
- రైతుల ఇబ్బందులు షరా మామూలే
- ఓఎన్జీసీ ఖర్చు చేసిన రూ.36 లక్షలు వృథా



పినపళ్లలోని అనతికాలంలోనే ఛిద్రమైన ఓఎన్జీసీ వేసిన తారు రోడ్డు



గుంతలతో దారుణంగా తయారైన తారు రోడ్డు

ఆలమూరు: మా పొలాలకు తారు రోడ్డు పడిందని సంబరపడినంత సేపు లేదు. మూడున్నర నెలల ముందు వేసిన రోడ్డు ముప్పై ఏళ్ల క్రితం వేసినట్లుగా శిథిలావస్థకు చేరిన దుస్థితి. ఓఎన్జీసీ నిర్లక్ష్యం...కాంట్రాక్టర్ల కక్కుర్తి.. రైతుల అమాయకత్వమే ఆ రోడ్డుకు శాపంగా మారింది. రోడ్డు నిర్మాణంలో తలెత్తిన లోపాలపై బాధ్యత వహిస్తూ ప్రజలకు జవాబుదారీతనంగా ఉండవలసిన ఓఎన్జీసీ, కాంట్రాక్టర్లు మాత్రం తప్పించుకునేందుకు ప్రయత్నించడంపై సర్వత్రా తీవ్ర విస్మయం వ్యక్తవుతుంది. ఆలమూరు మండలంలోని పినపళ్లలో రెండు దశాబ్దాల క్రితం నుంచే రిగ్‌లను ఏర్పాటు చేసుకుని ఓఎన్జీసీ చమురు, సహజవాయువు నిక్షేపాల అన్వేషణ కొనసాగిస్తుంది. ఓఎన్జీసీ నిర్వహిస్తున్న నిరంతర కార్యకలాపాల వల్ల వాహనాల రాకపోకల రద్దీని తట్టుకునేందుకు వీలుగా ఆ శాఖాధికారులు అప్పటి వరకూ ఉన్న పుంతరోడ్డును మెటల్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గత దశాబ్ద కాలం నుంచి ఆ రోడ్డును ఓఎన్జీసీ కనీసం మరమ్మతులు చేపట్టకుండా వదిలేసింది. దీంతో పాటు ఇటీవల కాలంలో అదే రోడ్డులో ఏర్పాటు చేసిన పేపరుమిల్లు, రైసుమిల్లు, ఇటుక బట్టీల వంటి పరిశ్రమల వల్ల భారీ వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. ఆ రోడ్డుకు ఇరువైపులా పంట కాలువ, వరిచేలు ఉండటం వల్ల వాహనాల తాకిడిని తట్టుకోలేక రోజు రోజుకు దెబ్బతింటూ శిథిలావస్థకు చేరుకుంది. ఆ రోడ్డు దుస్థితిపై గ్రామ రైతులు అప్పటి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, సర్పంచ్ సంగిత సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. ఓఎన్జీసీ అధికారులకు ఆ సర్వీస్ రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను సమగ్రంగా వివరించి రూ.36 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు వారిద్దరూ విశేష కృషి చేశారు. ఆరు లారీల చక్రాల వాహనాల వరకే రాకపోకలు సాగించవలసిన రోడ్డులో 60 చక్రాల లారీలు వందల టన్నుల్లో లోడుతో ప్రయాణించడం కూడా రోడ్డు దుస్థితికి కారణమైంది.

సార్వత్రిక ఎన్నికలకు ముందు రోడ్డు నిర్మాణం

ప్రతిష్టాత్మకమైన ఆ రోడ్డు నిర్మాణానికి బహిరంగ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి సార్వత్రిక ఎన్నికల ముందు పనులు ప్రారంభించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత వరకూ ఆ రోడ్డు పనులు రెండు దశల్లో కొనసాగాయి. అంతలోనే ఏమైందో కాని తొలిదశలో మెటల్ రోడ్డును ఒక కాంట్రాక్టర్ చేత, మలిదశ తారు రోడ్డు పనులను మరో కాంట్రాక్టర్‌తో ఓఎన్జీసీ అధికారులు చేయించారు. స్థానిక పుంతలో ముసలమ్మ అమ్మవారి ఆలయం నుంచి మురుగు కాలువ వరకూ 1.8 కిలోమీటర్ల మేర నాలుగు మీటర్ల వెడల్పున ఎట్టకేలకు తారు రోడ్డు నిర్మాణం జరుపుకొంది. ఇదే క్రమంలో మూడున్నర నెలలు తిరక్కుండానే రాళ్లు లేచిపోయి రోడ్డుకు ఇరువైపులా భయంకరమైన గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఆ రోడ్డు ప్రయాణమంటేనే వందలాది ఎకరాలు సాగు చేస్తున్న రైతులు, వాహనదారులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. రోజులు గడుస్తున్నా ఈ రోడ్డు దుస్థితిపై ఎవరూ పెదవి విప్పకపోవడంపై స్థానికులు, ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

నాణ్యతా లోపంతో దెబ్బతిన్న రోడ్డుకు బాధ్యులెవరు?

అభివృద్ధి పనుల్లో అపార అనుభవమున్న ఓఎన్జీసీ మాత్రం రోడ్డు నిర్మాణం విషయంలో స్థానిక రైతులకు తీరని అన్యాయం చేసిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఎర్త్ వర్క్‌లో సరైన నాణ్యత లేకపోవడంతో పాటు నాసిరకం మెటీరియల్ వాడి ఉంటారని స్థానికులు భావిస్తున్నారు. మెటల్ రోడ్డు వేసేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో పాటు మెటల్‌ను తక్కువగా వినియోగించి ఎత్తు పెంచకపోవడం కూడా రోడ్డు దుస్థితికి కారణమని నిపుణులు చెబుతున్నారు. అలాగే ఆరోడ్డుకు తారు పూసేటప్పుడు సరైన నిర్మాణ విలువలు పాటించలేదనే ఆరోపణలు అప్పట్లోనే వచ్చాయి. అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న బెర్మ్‌లను పటిష్టం చేయకుండా హడావుడిగా నిర్మాణం చేపట్టం వల్ల కృంగిపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఈ రోడ్డును నిపుణుల పర్యవేక్షణలోనే పునర్నిర్మించాలనే డిమాండ్ వ్యక్తమవుతుంది. అయితే ఈ రోడ్డు తీవ్రంగా దెబ్బతినడానికి కారణం మేమంటే మేము కాదంటూ కాంట్రాక్టర్లు వాదనలు వినిపిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఓఎన్జీసీ అధికారులను వివరణ కోరే ప్రయత్నం చేయగా వారెవరూ అందుబాటులోకి రాలేదు.

ఓఎన్జీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



ఓఎన్జీసీ నిర్మించిన తారు రోడ్డు అనతికాలంలోనే తీవ్రంగా దెబ్బతినడంపై గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. రోడ్డు దుస్థితిపై ఓఎన్జీసీ ఉన్నతాధికారులకు వివరించగా సానుకూలంగా స్పందించారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత వచ్చే నెలాఖరు నాటికి రోడ్డును పటిష్టం చేస్తామని హామీ ఇచ్చారు. ఓఎన్జీసీ సర్వీస్ రోడ్డును మరింత దృఢంగా నిర్మించే వరకూ అధికారులపై ఒత్తిడిని తీసుకువచ్చి పనులు పూర్తి చేయిస్తాం.

– సంగిత సుభాష్, సర్పంచ్, పినపళ్ల

క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ ముఖ్యం



నంబర్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్న ఎస్సై సురేష్

మలికిపురం: యువత క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ కలిగి ఉండాలని మలికిపురం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సూచించారు. శనివారం మలికిపురంలో ప్రధాన రహదారులపై ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. వెహికల్ చెకింగ్‌లో ఐదు నంబర్ లేని మరియు సైలెన్సర్ లేని మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే మోటార్ సైకిల్ కి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా గాని నెంబర్ లేకుండా గాని సైలెన్సర్ లేకుండా గాని వెళ్లిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

సంపూర్ణ పారిశుధ్య చర్యలు



పినపళ్లలో క్రిమి సంహారక మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

ఆలమూరు: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సమీపిస్తున్న దృష్ట్యా జిల్లా పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యగా మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం పారిశుధ్య చర్యలు ముమ్మరం చేశారు, ఆయా గ్రామాల్లోని పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది డ్రైనేజీలను శుభ్రం చేసి చెత్త చెదారాన్ని బయటకు తరలించారు. వాటర్ ట్యాంకులకు క్లోరినేషన్ చేయిస్తున్నారు. ప్రధాన రహదారుల్లో బ్లీచింగ్ చల్లి పరిశుభ్ర వాతావరణాన్ని నెలకొల్పారు. వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్తపూత నమూనా పరీక్షలు నిర్వహించి ఆరోగ్యంపై భరోసా కల్పిస్తున్నారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంపీటీసీ రాజీనామా

మలికిపురం: మండలంలోని రామరాజులంక–2 గ్రామ ఎంపీటీసీ మేడిచర్ల వెంకట్రాజు వైఎస్సార్ సీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి రాజీనామా చేస్తూ పదవిలో కొనసాగుతానని తెలిపారు.

నేటి నుంచే ప్రతి ఇంటిపై జాతీయ జెండా



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

మామిడికుదురు: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం నుంచి గురువారం వరకు ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేసేలా కార్యాచరణ చేపట్టాలని బీజేపీ కార్యకర్తల సమావేశం పిలుపునిచ్చింది. మామిడికుదురు అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షత వహించారు. బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించాలని, స్కూల్ విద్యార్థులతో త్రివర్ణ పతకాల ప్రదర్శన నిర్వహిస్తామని రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు కంకిపాటి సుబ్బారావు తెలిపారు. స్వాతంత్ర్యోద్యమ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయడం, పూలమాలల అలంకరణ, విగ్రహాల పరిసరాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశంలో పసుపులేటి మహాలక్ష్మీరావు, వేగి వెంకటేశ్వరరావు, నక్కా త్రిలోచనరావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, సుంకర నాగభూషణం, తూము సాయి తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ పాత్ర ఎంతో కీలకం



మామిడికుదురులో యూటీఎఫ్ ఆవిర్భావ వేడుకలో పాల్గొన్న ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు

మామిడికుదురు: రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా మామిడికుదురు మండల మానవ వనరుల కేంద్రం వద్ద యూటీఎఫ్ పతాకాన్ని ఎంఈఓలు ఎస్.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు ఆవిష్కరించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ఎంతో కీలక పాత్ర పోషించిందని వారు గుర్తు చేశారు. యూటీఎఫ్ సాధించిన విజయాలు చరిత్ర పుటల్లో సజీవంగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు జి.నాగప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాలం పెద్దిరాజు, ప్రతినిధులు కుడుపూడి సత్యనారాయణ, వైఎస్సార్‌వీ అప్పారావు, యెరుబండి నాగేశ్వరరావు, టీఆర్‌కే గణపతిరావు, గుబ్బల మురళీకృష్ణ, అమలదాసు సత్తిబాబు, కె.నరసింహారావు, ఏవీ శ్యామలావతి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కాలుకు రూ.14 వేల సాయం



బాధితుడికి కృతిమ కాలుకు సాయం అంజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో కాలుపోయి కృత్రిమ కాలు కోసం సాయం అర్థించిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.14 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన గనిశెట్టి సతీష్ లారీ క్లీనర్‌గా చేసేవారు 20 సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమయింది. ఇంతకాలం కాలికి ట్రీట్‌మెంట్ చేయించుకున్నారు. 3 నెలల క్రితం కాలు తీసేశారు. ఈయనకి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు, కృత్రిమ కాలు పెట్టించుకుని ఏదో ఒక పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటున్నారు. కృత్రిమ కాలు పెట్టించుకోవడానికి డబ్బులు లేని పరిస్థితి. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. పసలపూడిలో సతీష్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.14 వేలు నగదు సాయంగా అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

బాధితులకు రెడ్ క్రాస్ ఆర్థిక సాయం



కొప్పిగుంటలో అగ్నిబాధితులకు ఆర్థికసాయం అందచేస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

కాట్రేనికోన: ఇటీవల కొప్పిగుంటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్నిప్రమాద బాధితులు కడలి సత్యవతి కుటుంబానికి శనివారం రెడ్ క్రాస్ సొసైటీ ఆర్థికసాయం చేసింది. కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారాయణ (ఢిల్లీ నారాయణ) సూచనలతో అగ్నిబాధిత కుటుబానికి వంట సామగ్రి, టార్పాలిన్, హైజినిక్ కిట్లను అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్నప్రసాద్, కముజు శ్రీనివాసరావు, రామసుబ్రమణ్యం, వాసంశెట్టి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి మల్లికార్జునరావు, శ్రీహరి సత్యనారాయణ, వెర్రియ్య, గుత్తుల గోపాలం తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకల ఖర్చు పెంపుపై హర్షం

అయినవిల్లి: ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం ఖర్చులకు పంచాయతీలకు ఇచ్చే ఫండ్ పెంచడంపై సర్పంచుల సమాఖ్య మండలశాఖ అధ్యక్షురాలు వార జయసావిత్రి ఆధ్వర్యంలో సర్పంచులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. మైనర్ పంచాయతీకి రూ.10 వేలు, మేజర్ పంచాయతీకి రూ.25 వేలు ప్రకటించడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కాకర బాబ్జి, సలాది బుచ్చిరాజు, ప్రభాత్‌కుమార్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాల బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న కనికిరెడ్డి తదితరులు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పుస్తకాలు బ్యాగులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రటరీ కె.నరేష్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ రమణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి మండలంలోని నల్లచెరువు గ్రామంలో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటికి బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

రాష్ట్రంలో రావణ కాష్టం

- మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- కొత్తపేటలో నల్ల బ్యాడ్జీలతో నిరసన
- అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



కొత్తపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: రాష్ట్రంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రావణ కాష్టం నడుస్తుందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహంపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ నియోజకవర్గ కేంద్ర కొత్తపేటలో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విగ్రహం వద్ద కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డి మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున అంబేడ్కర స్మృతివనంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఏర్పాటును నేటి పాలకులు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ శిల్పంపై దాడి జరిగిన రోజు ఏపీ చరిత్రలో చీకటి రోజు అని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుక్షణం నుంచే పాలకుల కనుసన్నల్లో దాడులకు తెరలేపారని ఆరోపించారు. తాజాగా అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చేందుకు కుట్ర పన్నారన్నారు. ఇది దేశం తలదించుకోవాల్సిన ఘటన అని అన్నారు. నిజంగా దుష్టశక్తుల పనే అయితే ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కానీ వారి వద్ద సమాధానం లేదన్నారు. చంద్రబాబుకు అందరి ఆరాధ్యుడైన అంబేడ్కర్ పట్ల, దళితుల పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. దానికి ఉదాహరణే దళితుల్లో పుట్టాలని ఎవరు కోరుకుంటారని గతంలో చంద్రబాబు వ్యాఖ్యానించిన విషయాన్ని గుర్తు చేశారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి డైవర్షన్ పాలిటిక్స్‌కు చంద్రబాబు తెరలేపారని విమర్శించారు. రూ.650 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అమ్మ ఒడి తదితర పథకాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ప్రభుత్వం ఉందన్నారు. చంద్రబాబు సైకోగా, లోకేష్ పిల్ల సైకోగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దాడులను అరికట్టకపోతే భవిష్యత్‌లో ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్, రాష్ట్ర పార్టీ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు, కర్రి నాగిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంస పాలనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

రాజోలు: రాష్ట్రంలో సాగుతున్న విధ్వంస పాలనకు నిరసనగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆధ్వర్యంలో రాజోలు ఆర్టీసీ బస్టాండ్ నుంచి శివకోడు కందికట్టు వారి గ్రూపు వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గొల్లపల్లి మాట్లాడుతూ విజవాడలో అంబేడ్కర్ స్మృతి వనం పరిధిలో శిలాఫలకాలతో పాటు వివిధ రకాల సామగ్రిని అల్లరి మూకలు ధ్వంసం చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం చీకటి పాలన సాగిస్తుందని గొల్లపల్లి ఆరోపించారు. ప్రజా సంక్షేమాన్ని, పాలనను విస్మరించి రాజకీయ కక్షలను ప్రభుత్వం ప్రోత్సహించడం దారుణమన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మంగెన సింహాద్రి, కోటిపల్లి ఏస్తేరు రాణి, కూనపరెడ్డి రాంబాబు, గొల్ల చిన్ని, అడబాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకాలు: జెడ్పీ చైర్మన్ విప్పర్తి

పి.గన్నవరం: విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై విధ్వంస కాండకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సృష్టిస్తున్న అరాచకాలకు ఈ దాడి ఒక ఉదాహరణ అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిని నిరశిస్తూ విప్పర్తి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పి.గన్నవరం సెంటర్లో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి విప్పర్తి, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి, నేలపూడి స్టాలిన్‌బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. విప్పర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఇటువంటి దౌర్జన్య కాండను ఎప్పుడూ చూడలేదన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో దౌర్జన్యాలు, హత్యాకాండలు మితిమీరిపోయాయని అన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్ విగ్రహాన్ని దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి నిర్మిస్తే, దానిపై దాడులు చేయడానికి చేతులు ఎలా వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు, విత్తనాల ఇంద్రశేఖర్, కొమ్ముల రాము, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, యన్నాబత్తుల ఆనంద్, జక్కంపూడి వాసు, పేరి శ్రీనివాస్, నీతిపూడి గణేష్‌బాబు, సాదనాల రమేష్, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసుబాబు, గుమ్మడి ప్రసాద్, పులిదిండి ప్రభాకర్ పాల్గొన్నారు.



శివకోడు అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు